మహోన్నత వ్యక్తి 'చిలుకూరి'

కడప అర్బన్ : తెలుగు సాహిత్యంలో తొలిసారిగా లక్షా 50 వేల సామెతలను సేకరించిన భాషావేత్త, నంద్యాలలో జరిగిన ఆంధ్ర మహాసభలో 'దత్త మండలాలు'గా ఉన్న ప్రాంతానికి 'రాయలసీమ' నామకరణం చేసిన మేధావి డాక్టర్ చిలుకూరి నారాయణరావు అని సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సహాయ పరిశోధకులు డాక్టర్ చింతకుంట శివారెడ్డి పేర్కొన్నారు. యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్ర ంలో బుధవారం ప్రసిద్ధ భాషావేత్త చిలుకూరి నారాయణరావు 135వ జయం తిని నిర్వహించారు. కార్యక్రమంలో ముందుగా సి.పి.బ్రౌన్ భాషా పరిశో ధన కేంద్రం సహాయ పరిశోధకులు డాక్టర్ చింతకుంట శివారెడ్డి, పరిశోధన కేంద్రం సిబ్బంది, పాఠకులు కలసి చిలుకూరి నారాయణరావు చిత్రపటానికి నివాళు లర్పించారు. కార్యక్రమంలో సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం గ్రంథ పాలకుడు జి.హరిభూషణ్‌రావు, జూనియర్ అసిస్టెంట్ ఆర్.వె ంకటరమణ, పాఠకులు రాజారెడ్డి, హరి, చంద్రశేఖరరెడ్డి, వెంకటరమణ పాల్గొన్నారు.

శిథిలావస్థలో ఉన్న వెలిగల్లు భవనం

టెన్షన్.. టెన్షన్..

- శిథిలావస్థలో వెలిగల్లు భవనం
- భయం గుప్పిట రెగ్యులర్ సందర్శకులు
- ఇరిగేషన్ ఉద్యోగుల్లో ఆందోళన
- నిద్రావస్థలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

వెలిగల్లు నీటి పారుదల శాఖ కార్యాలయం శిథిలావస్థకు చేరుకుంది. జిల్లా కేంద్రంలోని ఇరిగేషన్ రెగ్యులర్ డివిజన్ ఆవరణంలో వెలిగల్లు ఇంజినీరింగ్ కార్యాలయం ఉంది. గతంలో ఇక్కడి నుంచి ఎగ్జిక్యూటివ్ ఇంజినీరింగ్ యంత్రాంగం కార్యకలాపాలు సాగించేది. వర్షాకాలంలో ఉరుస్తోందనే కారణంతో వెలిగల్లు ఇంజినీరింగ్ యంత్రాంగం అతిథిగృహాన్ని ఆశ్రయించింది. అనంతరం ఇంజినీరింగ్ యంత్రాంగం భవన మరమ్మతులను గాలికి వదిలేసింది. ఫలితంగా పాడుబడి శిథిలావస్థకు చేరుకుంది. ప్రతి ఏటా కురుస్తున్న వర్షాల కారణంగా ఎవరి ప్రాణాలు తీద్దామా అని ఎదురు చూస్తోంది. ఇటువంటి ప్రమాదకర పరిస్థితుల్లో వెలిగల్లు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నిద్రావస్థలో జోగుతుండడం ఆందోళన కలిగిస్తోంది.

1989లో రూ.కోట్ల వ్యయంతో వెలిగల్లు ఇంజినీరింగ్ కార్యాలయం నిర్మితమైంది. దీనికి అతి సమీపంలో ఇరిగేషన్ రెగ్యులర్ కార్యాలయ ఆవరణంలో ఇరిగేషన్ ఎగ్జిక్యూటివ్ కార్యాలయం, ఇరిగేషన్ డిప్యూటీ ఇంజినీరింగ్ కార్యాలయం, ప్రపంచ బ్యాంకు నిధుల సహాయంతో చెరువుల అభివృద్ధి కార్యాలయం, అన్నమయ్య ఎగ్జిక్యూటివ్ ఇంజినీరింగ్ కార్యాలయం సహా పలువురు ఎఇలు, డిఇల కార్యాలయాలు కార్యకలాపాలు సాగిస్తున్నాయి. ప్రతిరోజూ ఇరిగేషన్ రెగ్యులర్ కార్యాలయ సందర్శకులు ఇంజినీర్ల అపాయింట్‌మెంట్ల కోసం పదుల సం ఖ్యలో సందర్శకులు వస్తుంటారు. శిథిలావస్థకు చేరిన వెలిగల్లు భవన సముదాయాన్ని ఆనుకుని వాహనాలు నిలుపుకోవడం, ఇంజినీర్ల అపాయింట్‌మెంట్ కోసం నిలుచుకోవడం పరిపాటి. అటువంటి సమయంలో శిథిలావస్థకు చేరు కున్న వెలిగల్లు ఇంజినీర్ కార్యాలయం కూలితే పదుల సం ఖ్యలో సందర్శకులు ప్రాణాలను, వాహనాలను కోల్పోయే ప్రమాదం పొంచి ఉంది. రెండ్రోజుల కిందట వీచిన గాలికి చెట్టుకు ఉన్న పెద్దకొమ్మ విరిగిపడిన సంఘటన చోటు చేసుకుంది. గాలివీచే సమయంలో చెట్టు కింద గానీ, శిథిలా వస్థ దశలో ఉన్న వెలిగల్లు ఇంజినీరింగ్ కా ర్యాలయ భవనం కింద గానీ సందర్శకులు లేకపోవడం ఉప శమనం కలిగి ంచింది. ఇటు వంటి ప్రమాదకర పరిస్థితులు కళ్లెదుట కనిపి స్తున్నప్పటికీ వెలిగల్లు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సదరు భవ నానికి మరమ్మతులు చేయడమా, కూల్చే యడమా అనే అంశాన్ని మరిచి మొద్దునిద్రను నటించడం విస్మయాన్ని కలిగిస్తోంది. దీనిపై ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌ను సంప్రదించగా అందుబాటులోకి రాకపోవడం గమనార్హం.

మోడీ నుంచి దేశాన్ని కాపాడుకుందాం

- 'క్విట్ మోడీ.. సేవ్ ఇండియా' నినాదంతో నిరసన
- ఆందోళనకు సంఘీభావం ప్రకటించిన సిపిఎం, సిపిఐ

ప్రజాశక్తి - కడప అర్బన్

కడప : తపాలా ప్రధాన కార్యాలయం ఎదుట నిరసన తెలియజేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో కేంద్ర కార్మిక, రైతు సంఘాల పిలుపుమేరకు కడప హెడ్‌పోస్ట్ ఆఫీస్ వద్ద నిరసన కార్యక్రమం సిఐటియు, ఎపిఐయుసి, రైతు, వ్యవసాయ కార్మిక, విద్యార్థి, యువజన, మహిళా సం ఘాల ఆధ్వర్యంలో బుధవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మనోహర్, నాగ సుబ్బారెడ్డి, దస్త గిరిరెడ్డి, అన్వేష్, ఎం. వి. సుబ్బారెడ్డి, సుబ్బమ్మ మాట్లాడారు. మోడీ ప్రభుత్వం అంబానీ, ఆదానీలకు కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాలని పిలుపు నిచ్చారు. మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజలపై పన్నుల భారాలు మోపుతూ, కార్మికులను బానిస సంకెళ్లు మార్చేందుకు 44 లేబర్ చట్టాలను కుదించి నాలుగు లేబర్ కోడ్‌లు తెచ్చారని, 3 వ్యవసాయ చట్టాల రూపంలో భూములను కార్పొరేట్లకు అప్పగించేందుకు ప్రయత్నించారని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఆదాయం తీసుకొచ్చే విశాఖ ఉక్కు, ప్రభుత్వరంగ బ్యాంకులను ప్రయివేట్ దోపిడీదారులకు అప్పగించేందుకు తీవ్ర ప్రయత్నం చేస్తున్నారన్నారు. 8 ఏళ్ల కాలంలో ఆరు లక్షల చిన్న, మధ్య తరహా పరిశ్రమలు మూతపడ్డాయని పేర్కొన్నారు. వీటిలో పనిచేసే లక్షలాదిమంది కార్మికులకు ఉపాధి లేకుండా పోయిందన్నారు. భారతదేశం మోడీ హయాంలో ఆకలి సూచికలో బంగ్లాదేశ్, శ్రీలంక దేశాలకంటే వెనుకపడినట్లు ప్రపంచ గణాంకాలు తెలియజేస్తున్నాయని చెప్పారు. నిరుద్యోగం, అధిక ధరలు, ఆహార సంక్షోభాన్ని మోడ ప్రభుత్వం పరిష్కారం చేయలేక, ప్రజల ఐక్యతకు భంగం కలిగించే విచ్ఛిన్నకర సిఎఎ, ఎన్ఆర్‌సి, యుసిసి చట్టాలను బలవంతంగా రుద్దే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. ఇందులో భాగంగానే మణిపూర్ రాష్ట్రంలో వందల సంవత్సరాలుగా కలిసున్న మెయితీ, కుకీ ప్రజల మధ్య ఎస్టీ రిజర్వేషన్ సమస్యను సృష్టించి మారణ హోమానికి కారణమయ్యారని తెలిపారు. మోడీ ఏం మాట్లాడాలో, ఏం చేయాలో ఆర్ఎస్ఎస్ నిర్ణయిస్తుందని, ఆర్ఎస్ఎస్ మతోన్మాద ఎజెండాను అమలు చేయడమే మోడీ కర్తవ్యంగా భావి స్తున్నారని పేర్కొన్నారు. ఇక్కడ మోడీ మనసులో భారత రాజ్యాంగానికి కాని, ప్రజాస్వామ్యానికి గాని స్థానంలేదని విమర్శించారు. మోడీ ప్రభుత్వం చేస్తున్న ప్రజా వ్యతిరేక నిర్ణయాలన్నీ రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం తూచా తప్పకుండా అమలు చేస్తూ ప్రజలకు అన్యాయం చేస్తున్నారు. మోడీ విధానాలను రాష్ట్రంలో అమలు చేసే పార్టీలకు ప్రజలు, కార్మికులు, మేధావులు ఓటుద్వారా బుద్ధి చెప్పాలని పిలుపు నిచ్చారు. ఎల్‌సి డివిజనల్ అధ్యక్షులు రఘునాథరెడ్డి, సిపిఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం ఆదానీ, అంబానీలకు కార్పొరేట్ కంపెనీలకు ఊడిగం చేస్తున్నదని విమర్శించారు. కార్యక్ర మంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు శ్రీని వాసులురెడ్డి, జి. వేణుగోపాల్, వామపక్ష కార్మిక సంఘాల నాయకులు ఉద్ధి. మద్దిలేటి, చంద్ర రెడ్డి, బాదుల్లా, లక్ష్మీదేవి, సుబ్బమ్మ, కామేశ్వరమ్మ, భాగ్యమ్మ, ఢిల్లీ ఎపిఎ నగర కార్యదర్శి ఓబులేసు, విజయ్, ఉదయ్, ఎస్ ఎఫ్ ఐ జిల్లా అధ్యక్షుడు ఎం. ఆర్. నాయక్, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు గోపాలకృష్ణయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు నరసయ్య, వామపక్ష కార్మిక సంఘాల నాయకులు నాగి రెడ్డి, సుబ్బరాయుడు, ఆర్.బాబు, ఈశ్వ రయ్య, మునెయ్య, బాబు పాల్గొన్నారు.

పోరుమామిళ్ల : మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కనీస వేతనాలు అమలు చేయడం లేదని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎన్. భైరవ ప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్ అఖిల భారత కమిటీ పిలుపు మేరకు పట్టణంలోని సబ్ పోస్ట్ కార్యాలయం వద్ద ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షించాలని సిఐటియు మండల కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం సబ్ పోస్టాఫీసు అధికారి వినతి పత్రం అంద జేశారు. కార్యక్రమంలో సిఐటియు మండల నాయకులు సుందరం, రత్నం, అంగన్వాడీ మండల నాయకురాలు రేణుకాదేవి, స్వాతి, రమాదేవి, సిఐటియు కార్యకర్తలు మాబు, బీబి, లూర్ధమేరి, లక్ష్మమ్మ పాల్గొన్నారు.

పేదింటి ఆడపిల్లకు పెళ్లి కానుక : కలెక్టర్

కడప : పేదింటి ఆడపిల్లలకు రాష్ట్ర ప్రభుత్వం అందించే అపరూపమైన గొప్ప కానుకలు వైఎస్ఆర్ షాదీ తోఫా, కల్యాణమస్తు పథకాలు అని కలెక్టర్ వి.విజయ్ రామరాజు అభివర్ణించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పథకం మూడవ విడత ఆర్థిక సాయాన్ని తాడేపల్లి లోని క్యాంపు కార్యాలయం నుంచి బుధవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి వర్చువల్ విధానం ద్వారా బటన్ నొక్కి లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశారు. కార్యక్రమానికి స్థానిక కలెక్టరేట్ విసి హాలు నుంచి కలెక్టర్‌తో పాటు జెసి గణేష్ కుమార్, ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి, మైనారిటీ కార్పొరేషన్ సభ్యులు హిదాయతుల్లా, రాష్ట్ర ఉద్యాన సలహాదారు పి.శివ ప్రసాద్‌రెడ్డి హాజర య్యారు. ముఖ్యమంత్రి విసి ముగిసిన అనంతరం పథకానికి సంబంధించి వైఎస్ఆర్ జిల్లాలో ఈఏడాది ఏప్రిల్ 1 నుంచి జూన్ 30 మధ్య కాలంలో వివాహం చేసుకున్న అర్హులైన 616 జంటలకు ప్రభుత్వం మంజూరు చేసిన రూ. 4,82, 15,000 లను మెగా చెక్కు రూపంలో కలెక్టర్ అతిథులతో కలిసి లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అరులైన వారు పెళ్లైన 60 రోజుల్లోపు http://gsws-nbm.ap.gov.in ద్వారా అర్హులైన వారు దరఖాస్తు చేసు కోవచ్చన్నారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ డిడీ సంస్వతి, డిఆర్‌డిఎ పీడీ ఆనంద్ నాయక్, మైనా రిటీ వేల్ఫేర్ ఆఫీసర్ ఇమ్రాన్, బి కార్పొరేషన్ ఈడి బ్రహ్మయ్య, మున్సి పల్ కార్పొరేషన్ పిఒజి శ్రీనివాసులు, ఆయా సంక్షేమ శాఖల అధికా రులు, లబ్ధి పొందిన వధూవరులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పోస్టాఫీసుల్లో జాతీయ జెండా విక్రయాలు

వల్లూరు : ప్రతి తపాలా కార్యాలయాల్లోనూ జాతీయ జెండాలను విక్రయించుచున్నట్లు తపాలా శాఖ ఇన్‌స్పెక్టర్ సుశీల్ కుమార్ తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని తపాలా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆధ్యాత్మిక అమృత్ మహోత్సవంలో భాగంగా తపాలా కార్యాలయంలో జాతీయ జెండాలు అందుబాటులో ఉన్నాయన్నారు. కేవలం ఒక జెండా రూ. 25 మాత్రమే అని తెలిపారు. www.epostoftice.gov in వెబ్ సైట్ ద్వారా ఆర్డర్ పెడితే తమ సిబ్బంది నేరుగా ఇంటి వద్దకే వచ్చి జెండాలు అందజేస్తారన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ కూడా సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇంకా ఎన్నో అవకాశాల కోసం తమ సమీప పోస్ట్ ఆఫీస్‌లను సంప్రదించాలని సూచించారు సమావేశంలో పోస్ట్‌మాస్టర్ రమాదేవి, ఎమ్‌ఎల్‌ఒఎస్ రాజగోపాల్, భాస్కర్ బిపిఎంలు తపాల సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా యువజన కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి - కడప

జెండాను ఆవిష్కరిస్తున్న యువజన నాయకులు

ప్రపంచంలో ప్రజాస్వామ్య దేశాలలో అత్యంత ఎక్కువ సభ్యత్వం, అతి పెద్ద యువకుల సంస్థ జాతీయ యువజన కాంగ్రెస్ అని కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షులు వై. విష్ణు ప్రీతం రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి చీకటి చార్లెస్ అన్నారు. బుధవారం యువజన కాంగ్రెస్ నగర అధ్యక్షులు దాసరి శివశంకర్ ఆధ్వర్యంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఆవరణలో జాతీయ యువజన కాంగ్రెస్ 63వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన ముఖ్య అతిథులు యువజన కాంగ్రెస్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ నగర అధ్యక్షులు దాశరి శివశంకర్, యువజన కాంగ్రెస్ రాష్ట్ర ఆర్‌టిఐ చైర్మన్ కోటపాటి లక్ష్మయ్య, యువజన కాంగ్రెస్ రాష్ట్ర ఆర్‌టిఐ వైస్ చైర్మన్ షేక్ అమీర్‌బాష, మహిళ నగర అధ్యక్షులు లావణ్య, యువజన కాంగ్రెస్ నగర ఉపాధ్యక్షులు బూచుపాటి ప్రసన్న కుమార్, కాంగ్రెస్ పార్టీ నాయకులు హరి, యువజన కాంగ్రెస్ నాయకులు నాగర్జున, వినోద్, ప్రశాంత్, బద్రి, నాయకులు పాల్గొన్నారు.

అన్ని పాఠశాలలను సందర్శించాలి : డిఇఒ

ప్రజాశక్తి-చెన్నూరు

కమిటీ సభ్యులందరూ మండలంలోని అన్ని పాఠశాలలను తరచుగా సందర్శిస్తూ ఉండాలని డిఇఒ రాఘవరెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఎంఆర్‌సి భవనంలో మండల స్థాయి పాఠశాలల భద్రతా కమిటీ ఏర్పాటు సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన డిఇఒ మాట్లాడుతూ కమిటీలో సభ్యులందరూ అన్ని పాఠశాలు తరచూ సందర్శించి విద్యార్థుల భద్రత కోసం సూచనలు, సలహాలు ఇవ్వాలన్నారు. ఎంపిడిఒ సురేష్‌బాబు మాట్లాడుతూ పాఠశాల భద్రతోపాటు నులిపురుగుల నివారణ మాత్రలు విద్యార్థులకు అందించారా లేదా అని పరిశీలించాలని చెప్పారు. కార్యక్రమంలో ఎంఇఒ గంగిరెడ్డి, ఎంపిపి చీర్ల సురేష్‌యాదవ్, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

పర్యాటక ప్రదేశాలకు ప్రచారం అవసరం

ప్రజాశక్తి - కడప అర్బన్

జిల్లాలో ప్రచారానికి నోచుకోని విలువైన పర్యాటక ప్రదేశాలు ఎన్నో ఉన్నాయని, అలాంటి ప్రదేశాలకు ప్రచారం కల్పించడంతోపాటు ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన అవసరం చాలా ఉందని యోగి వేమన విశ్వవిద్యాలయం విసి ఆచార్య చింతా సుధాకర్ పేర్కొన్నారు. యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో బుధవారం 'రాయలసీమ పర్యాటక ప్రదేశాలు- ఉపన్యాసం: 1' లో భాగంగా 'లంకమల్ల అభయారణ్య విశేషాలు' అనే అంశంపై కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన విసి మాట్లాడుతూ జిల్లా గొప్పతనం గురించి బయటి ప్రాంతాలవారికి తెలిసింది చాలా తక్కువని పేర్కొన్నారు. అనంతపురం జిల్లాకు చెందిన తనకు కూడా ఇక్కడకు ఉద్యోగరీత్యా వచ్చిన తర్వాతనే కొంత అవగాహనకు వచ్చిందన్నారు. సభాధ్యక్షులు, సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య తప్పెట రామప్రసాదరెడ్డి మాట్లాడుతూ విశ్వవిద్యాలయ అధికారుల ప్రోత్సాహంతో సి.పి. బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం తరపున సాహిత్య కార్యక్రమాలే కాకుండా రాయలసీమ పర్యాటకాల ప్రాంతాల గురించి పరంపరగా ఉపన్యాసాలు నిర్వహించదలచామని తెలిపారు. ప్రధానోపన్యాసకులుగా విచ్చేసిన వివేక్ లంకమల మాట్లాడుతూ కరోనా సమయంలో ఇంటివద్దనే ఉండి ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తున్న సందర్భంలో గతంలో పెద్దల వల్ల తమ ప్రాంతం లంకమల గురించి విన్న విశేషాలను స్వయంగా దర్శించి తెలుసుకోవాలనే ఉత్సాహం కలిగిందని చెప్పారు. కేరళ, ఊటీ, కొడైకెనాల్ లాంటి ప్రదేశాలకు సమానమైన ప్రకృతి సంపద ఇక్కడ ఉందన్నారు.

పోటీలను ప్రారంభిస్తున్న చిన్నపరెడ్డి, పోతుల వెంకట్రామిరెడ్డి

చదువుతోపాటు క్రీడలూ ముఖ్యమే

ప్రజాశక్తి - కడప అర్బన్

విద్యార్థులు చదు వుతోపాటు క్రీడ ల్లోనూ రాణించాలని ఇంటాక్ కడప చాప్టర్ కన్వీ నర్ కె. చిన్నపరెడ్డి, లయన్స్ క్లబ్ ఆఫ్ కడప అన్నమయ్య అధ్యక్షులు పోతుల వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఆర్ట్స్ కళాశాల గ్రౌండ్‌లోముందస్తు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా ఇంటాక్, లయన్స్ క్లబ్ ఆఫ్ కడప అన్నమయ్య ఆధ్వర్యంలో విద్యార్థులకు క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల్లో రాణించడం ద్వారా శారీరకంగా, మానసికంగా దృఢత్వం పెరుగుతుందన్నారు. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకుని పోటీలు ప్రారంభించారు. 8 జట్లు ఈ పోటీల్లో పాల్గొన్నాయని, ఫైనల్లో విన్నర్స్, రన్నర్స్‌కు ఈనెల 15న స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా బహుమతులు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ రవీంద్రనాథ్, లయన్స్ క్లబ్ ఆఫ్ కడప అన్నమయ్య ఉపాధ్యక్షుడు పద్మప్రియ చంద్రారెడ్డి, కార్యదర్శి కొండూరు జనార్దన్ రాజు, ఇంటాక్ సభ్యులు సంజీవరెడ్డి ,భారవి, కొండారెడ్డి, సొహైల్, అధ్యాపకుడు హజరతయ్య పాల్గొన్నారు.

రేపు సఫాయి కర్మచారుల జాతీయ కమిషన్ చైర్మన్ రాక

కడప : నేషనల్ సఫాయి కర్మచారీస్ చైర్మన్ ఎం. వెంకటేశన్ ఈ నెల 11 జిల్లాకు రానున్నట్లు కలెక్టర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 11.25 గంటలకు కడప విమానాశ్రయానికి చేరుకోనున్నారని తెలి పారు. అనంతరం మధ్యాహ్నం 2 గంటలకు కలెక్టరేట్‌లోని స్పందన హాలులో సఫాయి కర్మ చారుల సమావేశంలో పాల్గొంటారని పేర్కొన్నారు. ఎస్‌పి, కమిషనర్, జిల్లా విజిలెన్స్ మాని టరింగ్ కమిటీ సభ్యులు పాల్గొంటారు.

మేయర్ జన్మదిన వేడుకలు

కడప : ఎపి ఎన్ఆర్‌టిఎస్ డైరెక్టర్ బి.హెచ్. ఇలియాస్, ఎన్ఆర్ఐ గ్రూప్ ఆధ్వర్యంలో బుధవారం వైసిపి జిల్లా అధ్యక్షులు, నగర మేయర్ కె. సురేష్ బాబు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. కక్ కట్ చేసి అందరికీ పంచి పెటారు. కార్యక్రమానికి సహకారం అంది ంచిన యుఎఇ కన్వీనర్ సయ్యద్ అక్రమ్, ఎన్ ఆర్ఐ సభ్యులు షేక్ ఉస్మాన్ కు ఇలియాస్ ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమములో ఎన్ఆర్ఐ సభ్యులు మహిళా నాయకులు పి . రాజేశ్వరి, వెంకట సుబ్బమ్మ పాల్గొన్నారు.

రంగులు భావోద్వేగాలకు సంకేతాలు

కడప అర్బన్ : ఒక చిత్రాన్ని అందంగా ఆకర్షణీయంగా చేసేది కళ అని, ఇలాంటి కళాత్మక విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని యోగి వేమన విశ్వ విద్యాలయం ప్రిన్సిపల్ ఆచార్య ఎస్.రఘునాథ్ రెడ్డి అన్నారు. వైవీయూ లలిత కళల శాఖ విభా గాధిపతి డాక్టర్ మృత్యుంజయరావు అధ్యక్షతన 'కళ ద్వారా రంగులు, భావోద్వేగాలు' అనే అంశంపై పరస్పర చర్చ, ఉపన్యాస కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ప్రిన్సిపల్ ఎస్ రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ చిత్రకళకు విస్తృత డిమాండ్ ఉందని, సామాజిక మాధ్య మాల ద్వారా ఒక గొప్ప మార్కెట్ను సృష్టిం చవచ్చని చెప్పారు. ప్రధాన వక్త ప్రముఖ సైకాల జిస్ట్ ఒ. వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ ప్రముఖ సైకాలజిస్ట్ సిగ్మాండ్ ఫ్రాయిడ్ చెప్పి నట్లు మన మాటల్లో, చిత్రాల్లో ఆలోచనలు ఉం టాయ న్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు సి. హెచ్. వెంకటేష్, బి. ఈరయ్య, బి. చంద్రాయుడు, డాక్టర్ కె. రెడ్డిశేఖర్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

నాలుగు జిల్లాల బాధ్యునిగా డాక్టర్ తవ్వా వెంకటయ్య

కడప అర్బన్ : ఈనెల 29న గిడుగు రామ్మూర్తి పంతులు జయంతి సందర్భంగా ఆంధ్రప్రదేశ్ అధికార భాష సంఘం మాతృభాష వారోత్సవాలను నిర్వహించనున్న నేపథ్యంలో అధికార భాష సంఘం అధ్యక్షులు పి. విజయబాబు, సభ్యులకు వివిధ జిల్లాల బాధ్యతలు అప్పగించారు. అందులో భాగంగా డాక్టర్. తవ్వా వెంకటయ్యకు వైఎస్ఆర్ కడప, నంద్యాల, అనంతపురం, కర్నూలు జిల్లాల బాధ్యతలు అప్ప గించారు. తెలుగు భాష దినోత్సవానికి భాష సంఘం తరపున బాధ్యులుగా వ్యవహరిస్తారు.

గ్రామ కంఠాలను ఆక్రమిస్తే చర్యలు

- ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి-బి. కోడూరు

మున్నెల్లి గ్రామంలో పర్యటిస్తున్న తహాశీల్దార్

గ్రామ కంఠాలను ఆక్రమిస్తే చర్యలు తప్పవని తహాశీల్దార్ విద్యాసాగర్ హెచ్చరించారు. ఈనెల 5న ప్రచురితమైన 'సమస్యల వలయంలో మున్నెల్లి' కథనానికి స్పందించిన తహాశీల్దార్ బుధవారం గ్రామంలో సచివాలయ అధికారులతో కలిసి పర్యటించారు. ఆయన గ్రామంలోని గ్రామ కంఠాలను, ప్రమాదకర గుంతలను, వీధులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామ వీధికి ప్రభుత్వ హద్దులు తూర్పున చేతిపంపు, పడమర విద్యుత్ స్తంభం ఉన్నాయని, ఆ హద్దులకు లోబడి ఎవరైనా ఆక్రమిస్తే చర్యలు తప్పవని పేర్కొన్నారు. గ్రామంలో ఓకిలీ వీరారెడ్డి అనే వ్యక్తి వీధిలో ఆక్రమణ చేసి సిమెంట్ కాంక్రీట్ పనులు చేయడంతో మురుగునీరు వెళ్లడానికి వీలులేకుండా పోయిందని, దీని వల్ల రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. వారం లోగా వీధుల ఆక్రమణలు తొలగించి, అక్రమ గుంతలను పూడ్చివేస్తామని ఆయన గ్రామస్తులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, మున్నెలీ గ్రామ సచివాలయం పంచాయతీ సెక్రెటరీ, విఆర్ఒ, సర్వేయర్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న అమీర్‌బాబు

అలుపెరగని పోరాటయోధుడు గద్దర్

ప్రజాశక్తి - కడప అర్బన్

అలుపెరగని పోరాటయోధుడు గద్దర్ అని టిడిపి కడప నియోజకవర్గ ఇన్‌ఛార్జి వి.ఎస్.అమీర్‌బాబు, సిపిఎం సీనియర్ నాయకులు బి.నారాయణ అన్నారు. బుధవారం జిల్లా టిడిపి కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి ఆమూరి బాలదాసు అధ్యక్షతన గద్దర్ సంస్మరణ సభ నిర్వహించారు. గద్దర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అమీర్‌బాబు మాట్లాడుతూ గద్దర్ స్ఫూర్తి ప్రదాత అని పేర్కొన్నారు. 40 ఏళ్ల పోరాట జీవితంలో పేదల ఆక్రందనలు, భూమికోసం, భుక్తి కోసం అలుపెరగని పోరాటం చేశారని చెప్పారు. గద్దర్ మరణం తీరని లోటని టిడిపి ఘన నివాళి అర్పిస్తుందని తెలిపారు. బి. నారాయణ, టిడిపి సీనియర్ నాయకులు రెడ్యం వెంకటసుబ్బారెడ్డి మాట్లాడుతూ ప్రజా నా ట్యమండలిని స్థాపించి విప్లవ గేయాల ద్వారా స్ఫూర్తిని నిలిపి, ప్రజలను చైతన్య పరిచిన సాంఘిక విప్లవ యోధుడని కొని యాడారు. ఈయన మరణం తెలుగు రాష్ట్ర ప్రజలకు తీరని వేదన కలిగించిందని అన్నారు. దళిత నాయకులు జి. స్వామినాథన్, జె.వి. రమణ, సిఆర్‌వి ప్రసాద్ రావు మాట్లాడుతూ దళిత బిడ్డగా భూస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాటం చేసినా అన్ని వర్గాల ప్రజల సానుభూతిపరుడై జేజేలు అందుకున్న అమరుడు గద్దర్ అని పేర్కొన్నారు. సభకు అధ్యక్షత వహించిన బాలదాసు మాట్లాడుతూ గద్దర్ జీవితం పేదవాడి ఆకలి, దప్పులు, సామాజిక న్యాయం, భూమికోసం, భుక్తి కోసం ఉద్యమ నిర్వహణలో జీవితాన్ని త్యాగం చేసిన త్యాగజీవి గద్దర్ అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యులు బండి జకరయ్య, రాష్ట్ర కార్యదర్శి చీకటి చార్లెస్, సిపిఐ మహిళా విభాగం నాయకురాలు భాగ్యమ్మ, టిడిపి రాష్ట్ర మైనార్టీ సెల్ ఉపాధ్యక్షులు షేక్. జిలాని బాషా, నగర ఉపాధ్యక్షులు మహమ్మద్, డివిజన్ ఇన్‌ఛార్జులు కొండా సుబ్బయ్య, జనార్దన్‌రెడ్డి, బిసి సెల్ నాయకులు నబికోట శ్రీనివాసులు, యాదవ సంఘం జిల్లా యువజన విభాగం అధ్యక్షులు బుర్రి రెడ్డయ్య యాదవ్, నగర అధ్యక్షులు మేకల వెంకటేష్ యాదవ్, జర్నలిస్టు ఎద్దుల వెంకటేష్, రాష్ట్ర మానవ హక్కుల సంఘం కార్యనిర్వాహక అధ్యక్షులు కె.వి. రమణ, అంబేద్కర్ దళిత మిత్ర సంఘం నాయకులు జెల్లా వెంకటనాథ, మైనార్టీ సెల్ నగర అధ్యక్షులు ఇమ్రాన్, ఐ టిడిపి నగర అధ్యక్షులు వర కుమార్, హేతువాద సంఘం నాయకులు సి.హెచ్. శివారెడ్డి, రిటైర్డ్ డిఎస్‌పి ఫణిరాజ్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పట్ల అలసత్వం తగదు

కడప : ప్రజా సమస్యల పట్ల అలసత్వం వహించరాదని, విధులను బాధ్యతతో నిర్వహించాలని జిల్లా మాస్టర్ ట్రైనర్ గద్దె చంద్ర శేఖర్‌రావు ఉద్బోధించారు. బుధవారం కడప పట్టణంలోని నీహార్ శిక్షణ కేంద్రంలో మైదుకూరు, పులివెందుల, కడప మునిసిపాలిటీ సచివాలయ ఉద్యోగులకు ఇచ్చే నాలుగు రోజుల శిక్షణ ముగింపు సందర్భంగా ఆయన మాట్లాడారు. వివిధ సమస్యలు చేత పట్టుకొని వార్డు సచివాలయాలకు వచ్చే ప్రజల పట్ల మర్యాదతో నడుచుకోవాలని, వారిని గౌరవిస్తూ, సమస్యలను జాప్యం లేకుండా నిర్ణీత సమయంలో పరిష్కరించాలని హితవు పలికారు. సచివాలయంలోని వివిధ విభాగాల్లో పని చేస్తున్న ఆయా శాఖ కార్యదర్శులు ప్రభుత్వం ప్రజలకోసం ,వారి అభివృద్ధి కోసం అమలు పరుస్తున్న పథకాలు వారికి చేరువ అయ్యేలా నీతి, నిబద్ధతతో సేవలు అందించే విధులు నిర్వహించాలని తెలిపారు. ప్రభుత్వ సమయపాలను బట్టి విధులను నిజాయితీగా నిర్వహించాలని, క్రమ శిక్షణతో సమాజంలోని ప్రజల పట్ల మెలగాలని పేర్కొన్నారు. ప్రజల సమస్యలు పెండింగ్‌లో పెట్టకుండా వీలైనంత త్వరగా గడువు లోపు పరిష్కరించి అటు ప్రజలలో ప్రభుత్వం పట్ల మంచి పేరును తీసుకురావాలని సూచించారు. ఉన్నతాధికారుల ఆదేశాలను ఎప్పటి కప్పుడూ అమలు చేయాలని పేర్కొన్నారు.

విద్యుత్ ఉద్యోగుల సమ్మెను నివారించండి

కడప అర్బన్ : జిల్లాలో ఈనెల 10 నుంచి విద్యుత్ ఉద్యోగులు నిర్వహించబోయే సమ్మెను నివారించడానికి ముఖ్యమంత్రి జోక్యం చేసుకోవాలని సిపిఎం నగర కార్యదర్శి ఎ.రామమోహన్ డిమాండ్ చేశారు. బుధవారం సిపిఎం కార్యాలయం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ మేరకు కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులందరిని రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. పిఆర్‌సి, డిఎ, అరియర్స్, పాత పెన్షన్ పథకం, ఇతర సమస్యలను తక్షణమే పరిష్కారం చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వంతో 16 నెలల కాలంలో 26 సార్లు చర్చలు నిర్వ హించారని, అయినా సంబంధిత మంత్రి విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడంలో సరైన శ్రద్ధ చూపడం లేదని పేర్కొన్నారు. విద్యుత్ ఉద్యోగుల సమ్మె జరిగితే వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడే ప్రమాదముందని చెప్పారు. దీనికి రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి వస్తుందని హెచ్చరించారు. విద్యుత్ ఉద్యోగులు గొంతమ్మ కోరికలు కోరడం లేదని, న్యాయమైన కోర్కెలే పరిష్కారం చేయాలని కోరుతున్నారని అన్నారు. సమస్య పరిష్కారానికి ముఖ్యమంత్రి స్థాయిలో జోక్యం చేసుకుని కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. లేని పక్షంలో ఈ పోరాటం మరింత తీవ్రమవుతుందని, అందుకు ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి వస్తుందని పేర్కొన్నారు. సమావేశంలో సిపిఎం నాయకులు పారుక్ హుస్సేన్, విజయ్ పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్టు

ప్రజాశక్తి-పోరుమామిళ్ల

మాట్లాడుతున్న డిఎస్‌పి వంశీధర్‌గౌడ్

ఇటీవల పట ్టణంలో జరిగిన బంగారు చోరీ కేసును చేధించి, నలుగురు దొంగలను అదుపులోకి తీసుకొని వారి నుంచి తొమ్మిది తులాలు బంగారు, కిలో వెండిని స్వాధీనం చేసుకున్నట్లు మైదుకూరు డిఎస్‌పి వంశీధర్‌గౌడ్ పేర్కొన్నారు. కేసు సిఐ సురేష్‌రెడ్డి, ఎస్ఐ మల్లికార్జునరెడ్డి ఆధ్వర్యంలో చేధించారని తెలిపారు. బుధవారం పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డిఎస్‌పి మాట్లాడుతూ పట్టణంలోని పరిసర ప్రాంతాలలో దొంగతనాలకు పాల్పడుతున్న నలుగురు దొంగలను అరెస్టు చేసినట్లు తెలిపారు. బుధవారం బ్రహ్మంగారిమఠం మండలం లింగాలదిన్నె పల్లె గ్రామ సమీపంలో అనుమాస్పదంగా ద్విచక్ర వాహనంలో తిరు గుతున్న నలుగురిని పట్టుకుని అరెస్టు చేసి వారి వద్ద నుండి బం గారు వెండి వస్తువులు స్వాధీనం చేసుకున్నారని చెప్పారు. అనం తరం కోర్టులో హాజరు పరిచినట్లు తెలిపారు. నలుగురి నింది తులు ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలలో దొంగతనాలు చేశారని, ఆయా పోలీస్‌స్టేషన్లల్లో కేసులు నమోదయ్యాయని తెలిపారు.

పిహెచ్‌సిలో 'నాదేశం-నాభూమి'

చింతకొమ్మదిన్నె : స్థానిక చింతకొమ్మదిన్నె ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం డాక్టర్ రాఘవేంద్ర ఆధ్వర్యంలో జాతీయ జెండాను ఆవిష్కరించి ' మేరా మిట్టి మేరా దేశ్' కార్యక్రమం నిర్వహించారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతినెలా 9వ తేదీ జరిగే ప్రధానమంత్రి సురక్షా మాతృ అభియాన్ కార్యక్రమంలో బాగంగా 36 మంది గర్భిణులకు పరీక్షలు నిర్వహించి చికిత్సలు, సలహాలు సూచనలు అందజస్తామని చెప్పారు. అనంతరం ఆరోగ్య కేంద్రం ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో సిహెచ్ఒ సుకుమారన్, సూపర్‌వైజర్లు మోహన్ రెడ్డి, జనార్దన్, జయరత్న, మహి, సీనియర్ అసిస్టెంట్ మహబూబ్ సాహెబ్, స్టాఫ్ నర్స్ ఫ్లోరెన్స్, నాగమ్మ, పార్మాసిస్టు పద్మావతి, ప్రయోగశాల సాంకేతికుడు వరప్రసాద్ పాల్గొన్నారు.

కలసపాడు : స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ మహబూబ్‌బీ ఆధ్వర్యంలో బుధవారం నా భూమి నా దేశం, నేలతల్లికి నమస్కారం, వీరులకు వందనం, ఆజాద్ కా అమృత్ మహోత్సవం, కార్యక్రమాన్ని ఉపాధి సిబ్బంది, గ్రామపంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి మురారి, ఎపిఒ రవీంద్రారెడ్డి, టిఎలు టెక్నికల్ అసిస్టెంట్ మల్లేశ్వర్‌రెడ్డి, వినోద్ వసంత గోవింద్‌రెడ్డి పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఒ శ్రీధర్ నాయుడు

ప్రతి పంచాయతీలో శిలాఫలకం ఏర్పాటు

ప్రజాశక్తి - చాపాడు

'నా భూమి-నా దేశం' కార్యక్రమంలో భాగంగా ప్రతి గ్రామపంచాయతీలో నేల తల్లికి నమస్కారం.. వీరులకు వందనం శిలాఫలకాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపిడిఒ శ్రీధర్ నాయుడు తెలిపారు. బుధవారం స్థానిక కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ ఈనెల 9 నుంచి 15వ తేదీ వరకు కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నారు. ఖాళీ ప్రదేశాల్లో మొక్కలు నాటడం, స్వాతంత్ర్య సమర యోధులు, వారి పిల్లలను సన్మానించడం, ప్రతిజ్ఞ, జెండా వందనం, ప్రతి పంచాయతీ నుంచి మట్టి నమూనా సేకరించి మండలానికి చేర్చే కార్యక్రమాలు నిర్వహించాల్సి ఉందన్నారు. సమావేశంలో ఇఒపిఆర్‌డి రాధాకృష్ణవేణి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - జమ్మలమడుగు

కిడ్నీ సమస్యతో బాధపడుతున్న లోగిడి మారెన్నకు ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్‌రెడ్డి ఆర్థికసాయం అందించినట్లు జమ్మలమడుగు మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యుడు లక్ష్మయ్య తెలిపారు. బుధవారం పట్టణంలోని క్యాంప్‌బెల్ హాస్పిటల్‌లో కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే స్వయంగా ఆస్పత్రికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా కో-ఆప్షన్ సభ్యులు లక్ష్మయ్య మాట్లాడుతూ వైద్యులతో చర్చించి లోగిడి మారెన్న ఆరోగ్య పరిస్థితులను ఎమ్మెల్యే తెలుసుకున్నారని తెలిపారు. పలు జాగ్రత్తలు, వైద్య సలహాలు ఎమ్మెల్యే అందించారన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ లోగిడి జయన్న, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

అమరవీరుల త్యాగాలు మరువలేనివి

ప్రజాశక్తి - జమ్మలమడుగు

దేశ రక్షణ కోసం ప్రాణాలర్పించిన అమరవీరుల త్యాగాలు మరువలేనివని జమ్మలమడుగు మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రఫీక్ పాషా తెలిపారు. బుధవారం ఉదయం జమ్మలమడుగు ప్రభుత్వ ఆసుపత్రిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు దేశం కోసం ప్రాణాలు అర్పించిన వీరులకు అంకితం చేస్తూ నా మట్టి-నా దేశం కార్యక్రమం నిర్వహించారు. ప్రాంతీయ వైద్యశాల, ఎపి వివిపి, జమ్మలమడుగులో డాక్టర్ హెచ్ రఫీక్ పాషా ఆధ్వర్యంలో జెండా వందనం చేశారు. కార్యక్రమంలో వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

మాజీ సైనికులకు సన్మానం

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

స్థానిక మున్సిపల్ కార్యాలయంలో 'నా మట్టి-నా దేశం' కార్యక్రమంలో భాగంగా దేశ రక్షణ కోసం కృషి చేసిన మాజీ సైనికులకు మున్సిపల్ చైర్మన్ హర్షవర్ధన్‌రెడ్డి, కమిషనర్ జగన్నాథ్ బుధవారం తమ ఛాంబర్‌లో సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని అమరవీరుల జ్ఞాపకార్థం ఆగస్టు 9 నుండి 15వ తేదీ వరకు వివిధ కార్యక్రమాలు నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వం పిలుపు మేరకు కలెక్టర్ ఆదేశానుసారం ఈ సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు కమిషనర్ తెలిపారు. మున్సిపల్ ఆర్‌ఒ గంగిరెడ్డి, మేనేజర్ సి. వసంత్ పాల్గొన్నారు.

మొక్కలు నాటిన విద్యార్థులు

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు 'మేరా మట్టి-మేరా దేశ్' కార్యక్రమంలో భాగంగా ఎర్రగుంట్ల పరిసర గ్రామమైన కదిరివారిపల్లి గ్రామంలో మొక్కలను నాటారు. కళాశాల ప్రిన్సిపల్ రవికుమార్ మాట్లాడుతూ నాడు స్వాతంత్ర్యం కోసం ప్రాణ త్యాగం చేసిన మహనీయులను స్మరించుకోవాలని, దేశ ప్రగతికి పాటుపడాలని ఆకాంక్షించారు. గ్రామ సర్పంచ్ జయప్రద, వైస్ ప్రిన్సిపల్ ఈశ్వర్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దేశభక్తిని పెంపొందించేది ఎన్‌సిసి

జమ్మలమడుగు రూరల్ : దేశభక్తిని పెంపొందించేది మన కళాశాలలో ఎన్‌సిసి ఉండడం సాయి పరమేశ్వర డిగ్రీ కళాశాలలు గర్వకారణమని ఆ కళాశాల కరస్పాండెంట్ పాలా నాగేశ్వర్‌రెడ్డి అన్నారు. స్థానిక సాయి పరమేశ్వర డిగ్రీ కళాశాలను లెఫ్టినెంట్ కల్నల్ రాజ్‌కుమార్ తాపా సందర్శించి తనిఖీ చేశారు. ముందుగా కడప 30 ఆంధ్ర బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ రాజ్‌కుమార్ తాపాకు విద్యార్థులు ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఎన్‌సిసి ఆఫీసర్ లెఫ్టినెంట్ రాజు, హవల్దార్ గురుంగ, రాజగోపాల్ రెడ్డి పాల్గొన్నారు.

ఆస్పత్రిలో పండ్లు, బ్రెడ్లు పంపిణీ

పులివెందుల టౌన్ : ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో బుధవారం మానవత స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు సంబారి సుబ్బరాయుడు కుమారుడు వెంకట రాజేష్ పుట్టినరోజు సందర్భంగా వైద్య పరీక్షల కోసం వచ్చిన గర్భిణులకు బ్రెడ్లు, పండ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. మానవత స్వచ్ఛంద సంస్థ చైర్మన్ డివి కొండారెడ్డి, అధ్యక్షులు, కార్యదర్శి, కోశాధికారి సంబారి సుబ్బరాయుడు, చంద్రశేఖర్ రెడ్డి, హరినంద్రారెడ్డి, సభ్యులు నారాయణరెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, సివి భాస్కర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, అశ్వర్థ నారాయణరెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు

జమ్మలమడుగు : మండలంలోని పొన్నతోట బొమ్మేపల్లిలో జీవనం సాగిస్తున్న పుల్లగుర అంకమ్మ (45) చనిపోగా బంధువులెవరూ లేకపోవడంతో స్థానికులు మే హెల్ప్ యు ఫౌండేషన్ చైర్మన్ మోరే లక్ష్మణ్ రావును ఫోన్ ద్వారా సంప్రదించారు. ఆయన వెంటనే స్పందించి సంప్రదాయం ప్రకారం అంత్యక్రియలు నిర్వహించారు. కార్యక్రమంలో చైర్మన్ మోరే లక్ష్మణ్ రావు, తిరుపాల్, నక్క గురురాజశేఖర్, శివసాయినాథ్, సభ్యులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

మద్యం మత్తులో వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి - ఖాజీపేట

మండలంలోని ముత్తులూరుపాడు గ్రామానికి చెందిన ఎల్లంగారి నరసింహులు (38) మద్యం మత్తులో పురుగుల మందు తాగి జాతీయ రహదారి భూమాయపల్లె వంతెన వద్ద ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్ఐ రాజరాజేశ్వర్‌రెడ్డి తెలిపారు. నరసింహులు మద్యానికి బానిసయ్యారని, మద్యం కోసం డబ్బులు ఇవ్వమని ప్రతి రోజు తన భార్యతో గొడవ పడే వాడని తెలిపారు. మద్యానికి డబ్బులు ఇవ్వకపోతే చనిపోతానంటూ భార్యను బెదిరించేవాడని ఎస్ఐ తెలిపారు. గతంలో కూడా ఇతను పురుగుల మందు, వాస్కోల్ తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు కుటుంబ సభ్యులు పేర్కొన్నారని తెలిపారు. మృతుని భార్య అక్కయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయనున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ రాజరాజేశ్వర్‌రెడ్డి

ప్రారంభానికి సిద్ధంగా చిన్నగురువలూరు పశువైద్యశాల

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని చిన్న గురువులూరు గ్రామంలో నూతనంగా నిర్మించిన పశువైద్యశాల భవనం ప్రారంభానికి సిద్ధంగా ఉంది. గత ప్రభుత్వ హయాంలో నిర్మాణ పనులు చేపట్టినప్పటికీ భవనాన్ని ఇప్పటివరకు పూర్తి చేయలేదు. గడపగడపకూ మన ప్రభుత్వ కార్యక్రమంలో భాగంగా చిన్న గురువలూరుకు ఎమ్మెల్యే ఎస్‌రఘురామిరెడ్డి వచ్చిన సందర్భంలో పశు వైద్యాధికారి సుదర్శన్‌రెడ్డి పాత భవనం వర్షానికి ఉరుస్తోందని, అసంపూర్తిగా ఉన్న నూతన భవనాన్ని పూర్తి చేయించి రైతులకు అందుబాటులోకి తేవాలని కోరారు. ఇందుకు స్పందించిన ఎమ్మెల్యే పెండింగ్‌లో ఉన్న పనులు పూర్తి చేసి త్వరగా ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత కాంట్రాక్టర్‌కు సూచించారు. ప్రస్తుతం పశువైద్య సిబ్బంది దెబ్బతిన్న పాత భవనంలోనే విధులు నిర్వహిస్తున్నారు. చిన్న గురువలూరు, గాంధీనగరం, శ్రీరాములపేట, ఓబుల్‌రెడ్డిపేట గ్రామాల పరిధిలో పశుపోషణపై ఆధారపడి రైతులు అధికంగా జీవనం సాగిస్తున్నారు. పశువైద్యశాల చాలా వరకు దెబ్బ తినడంతో సిబ్బందికి అసౌకర్యంగా ఉండేది. ప్రస్తుతం నూతన భవనం పూర్తి కావడంతో త్వరలో రైతులకు, సిబ్బందికి అందుబాటులోకి రానుంది. మండల పరిధిలో సోమాపురం గ్రామంలో పశువైద్యశాల నిర్మాణ పనులు మధ్యలో ఆగిపోయాయి. మూతపడి దెబ్బతిన్న పాఠశాల గదిలో సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. సీతారామాపురం, పల్లవోలులో పశువైద్యశాలలు దెబ్బ తినడంతో పూర్తిగా తెరవడం లేదు. చియ్యపాడులో పశువైద్యశాల ఉన్నప్పటికీ సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో అక్కడ కూడా పాడి రైతులకు పశు వైద్యం దూరమైంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి దెబ్బతిన్న పశు వైద్యశాలలకు మరమ్మతులు చేపట్టి, సిబ్బందిని అందుబాటులో ఉంచితే పాడి రైతులకు ఉపయోగకరంగా ఉంటుందని పలువురు కోరుతున్నారు.

రక్తదానానికి యువత ముందుకు రావాలి

రక్తదానం చేస్తున్న యువత

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

'మా ఊరి సినిమా' హీరో పులివెందుల మహేష్ పుట్టినరోజు సందర్భంగా ఆ చిత్ర యూనిట్, స్నేహిత అమృత హస్తం సేవాసమితి ఆధ్వర్యంలో బుధవారం పులివెందుల ప్రాంతీయ ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ సెల్వరాజు, డాక్టర్ నవీన్, రక్తనిధి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శుభశ్రీ, సినిమా హీరో పులివెందుల మహేష్, సేవాసమితి అధ్యక్షులు రాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పులివెందులలో సినిమా హీరోగా ఉండడం సామాజిక బాధ్యతగా పలు సేవా కార్యక్రమాల్లో భాగంగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసి అభిమానులను ప్రాణదాతలు గా మార్చడం గొప్ప విషయమన్నారు. పులివెందుల యువ హీరో మహేష్ దినదినాభివృద్ధిగా మరెన్నో ఉన్నతస్థాయికి ఎదగాలని వారు ఆకాంక్షించారు. రక్తదాతలను అభినందించి, ప్రశంసాపత్రాలను అందజేశారు.

'మా ఊరి సినిమా' పోస్టర్ విడుదల

మా ఊరి సినిమా పోస్టర్ రక్తనిధి ఆవరణలో పులివెందుల పట్టణ సిఐ రాజు, రక్తనిధి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శుభశ్రీ, రాజు విడుదల చేసి యువ హీరో మహేష్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత సన్మార్గంలో నడిచి ఉత్తమ పౌరులుగా ఉన్నతస్థాయికి చేరుకుని పుట్టిన ఊరికి, కన్న వారికి పేరు ప్రఖ్యాతులు తేవాలన్నారు. కార్యక్రమంలో చిత్ర నిర్మాత మంజునాథ్‌రెడ్డి, ఎఎస్ఐ చంద్రశేఖర్ రావు (స్వామి), రైతు బిడ్డ హరి బృందం రక్తనిధి సిబ్బంది, సేవాసమితి పట్టణ అధ్యక్షులు మహమ్మద్ రఫీ, నేత్రనిధి టెక్నీషి యన్ హరీష్, యువకులు, అభిమానులు పాల్గొన్నారు.

పిహెచ్‌సి సేవలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - చాపాడు

గర్భిణులు పిహెచ్‌సి సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ టి.లక్షుమయ్య కోరారు. స్థానిక పిహెచ్‌సిలో బుధవారం గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎంపీపీ మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అన్నిరకాల వసతులున్నాయన్నారు. సిబ్బంది ఆసుపత్రి ప్రసవాలను పెంచేందుకు కృషి చేయాలన్నారు. వైద్యాధికారి రాజేష్ మాట్లాడుతూ గర్భిణులు పౌష్టికాహారం తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. రక్తహీనత లేకుండా చూసుకోవాలని పేర్కొన్నారు. ప్రతి నెల ప్రధానమంత్రి మాతృత్వ సురక్ష యోజనలో భాగంగా మండల పరిధిలోని గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అంగన్వాడీల ద్వారా పౌష్టిక ఆహారాన్ని అందిస్తున్నామన్నారు. క్రమం తప్పకుండా అంగన్వాడీల ద్వారా పౌష్టికాహారం పొందాలన్నారు. అలాగే క్రమం తప్పకుండా వైద్యులతో పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఈ సందర్భంగా అక్కడికి వచ్చిన 72మంది గర్భిణులకు పల్లవోలుకు చెందిన వైస్ ఎంపీపీ, సర్పంచ్ ప్రసాద్-కళావతి దంపతులు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా వారిని వైద్యసిబ్బంది సన్మానించారు. కార్యక్రమంలో వైద్యులు ఓబులేసు, శ్రీవాణి, కావ్య సిహెచ్‌ఒ మహాదేవ యాదవ్, వైసిపి నాయకులు రామసుబ్బారెడ్డి, శ్రీనువాసులరెడ్డి, సిబ్బంది భాస్కర్, రమేష్, నారాయణరెడ్డి, ఎఎన్ఎంలు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

భోజన వసతి కల్పించిన ప్రసాద్ దంపతులను సన్మానిస్తున్న ఎంపిపి, వైద్య సిబ్బంది

నులిపురుగుల నివారణకు కృషి చేయాలి..

నులిపురుగుల నివారణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని వైద్యులు రాజేష్‌కుమార్ సూచించారు. నులిపురుగుల నివారణ గోడపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపిపి టిలక్షుమయ్య, ఎంపిడిఒ శ్రీధర్ నాయుడు, అధికారులు పాల్గొన్నారు.

మున్సిపాల్టీని అభివృద్ధి చేస్తాం : చైర్‌పర్సన్

సమావేశానికి హాజరైన సభ్యులు

మాట్లాడుతున్న శివమ్మ

ప్రజాశక్తి - జమ్మలమడుగు

జమ్మలమడుగు మున్సిపాలిటీని అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని నగర పంచాయితీ చైర్‌పర్సన్ వేల్పుల శివమ్మ పేర్కొన్నారు. బుధవారం జమ్మలమడుగు నగర పంచాయితీ కౌన్సిల్ హాల్‌లో సాధారణ సమావేశం నిర్వహించారు. మొదటగా అజెండాలోని 15 అంశాలను సభ్యులు ఆమోదం తెలిపారు. ఈ సందర్భంగా వేల్పుల శివమ్మ మాట్లాడుతూ సభ్యులు తమ సమస్యలను సభ దృష్టికి తెస్తే వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. 9వ వార్డు కౌన్సిలర్ శివ మాట్లాడుతూ అవ్వతాతలకు కొత్త పెన్షన్లు 6 నెలలకు ఒకసారి ఇస్తామని ప్రభుత్వం ప్రకటించిందని కానీ, ఇంతవరకు అవి మంజూరు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వైస్ చైర్మన్ మంగదొడ్డి సింగరయ్య మాట్లాడుతూ నగర పంచాయితీలో వీధిలైట్లు సరిగ్గా వెలగడం లేదని, అధికారులకు ఫిర్యాదు చేసినా వారు స్పందించడం లేదని సభ దృష్టికి తెచ్చారు. నాలుగో వార్డ్ కౌన్సిలర్ జ్ఞాన ప్రసన్న మాట్లాడుతూ మున్సిపల్ రోడ్లు, డ్రయినేజీ పనుల్లో నాణ్యత లోపించిందని అధికారులు దృష్టి సారించాలని కోరారు. కాంట్రాక్టర్లు ఇష్టానుసారంగా పనులు చేస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆమె తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జి.వెంకట్రామిరెడ్డి, వైస్ చైర్మన్ పోరెడ్డి రామలక్ష్మమ్మ, కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య మనుగడకు ప్రమాదం

జమ్మలమడుగు రూరల్ : వైసిపి ప్రభుత్వం నిర్వాకం వల్ల ప్రజాస్వామ్య మనుగడకు ప్రమాదమని టిడిపి జమ్మలమడుగు ఇన్‌ఛార్జి భూపేష్‌రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు చేపట్టిన ప్రాజెక్టుల సందర్శనలో భాగంగా పుంగనూరులో పర్యటిస్తుండగా వైసిపి అల్లరి మూకలు చంద్రబాబు మీద రాళ్ళ దాడి చేసి తిరిగి ఆయన మీదనే ఎ1గా కేసు నమోదు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఎపిలో ప్రజా స్వామ్యం ప్రమాదంలో పడిందన్నారు. జెడ్ ప్లస్ భద్రత ఉన్న ప్రతిపక్ష నేత రాష్ట్రంలో పర్యటించే పరిస్థితి లేదంటే ప్రభుత్వం సిగ్గుతో తలదించుకోవాలన్నారు. చంద్రబాబు పర్యటనను అడ్డుకునేందుకు అడుగడుగునా ఆటంకాలు సృష్టించారన్నారు. వైసిపి అరాచక చర్యలకు తెలుగుదేశం పార్టీ బెదిరే ప్రసక్తే లేదన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ శివనాథరెడ్డి, పార్టీ పరిశీలకులు మద్దూరు రామకృష్ణ, రాష్ట్ర కార్యదర్శి రమణారెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి పొన్నతోట శ్రీనివాసులు, క్లస్టర్లు, యూనిట్ ఇన్‌ఛార్జి తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న భూపేష్‌రెడ్డి

పక్కాగా పంటకోత ప్రయోగాలు

ప్రజాశక్తి - ముద్దనూరు

పంటకోత ప్రయోగాలు పక్కాగా ఎంపిక చేయాలని వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు వెంకటసుబ్బయ్య అన్నారు. స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో బుధవారం ఎడిఎ ఆధ్వర్యంలో ఎఒ వెంకటకృష్ణారెడ్డి పంటకోత ప్రయోగాలపై మండలస్థాయి సిబ్బందికి శిక్షణా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎడిఎ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో పంటకోత ప్రయోగాలు పగడ్బందీగా నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. పంట కోత ప్రయోగాలు నిర్వహించే సమయంలో ఫొటోలు, వీడియోలు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొనేలా చూడాలని తెలిపారు. ఎఒ మాట్లాడుతూ పంట కోత ప్రయోగాలు నిర్వహించే సమయంలో రైతుల సమక్షంలో పొలాన్ని ఎంపిక చేసి తదుపరి ఫారం-1 వివరాలను అధికారులకు పంపించాలన్నారు. పంట కోత ప్రయోగం అనంతరం దిగుబడి వివరాలను సిపిఒ, వ్యవసాయ కార్యాలయాలకు దిగుబడి వివరాలను తెలపాలన్నారు. కార్యక్రమంలో ఎఎస్‌ఒ నవతేజ, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు కాంగ్రెస్ సమన్వయ కమిటీ సమావేశం

ప్రొద్దుటూరు : ప్రొద్దటూరు నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ సమన్వయ సభ్యుల కమిటీ సమావేశం గురువారం జరుగుతుందని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి నజీర్ ప్రకటనలో తెలిపారు. వన్‌టౌన్ సర్కిల్‌లోని షాదీముబారక్ ఫంక్షన్ హాలులో సమావేశం ప్రారంభమవుతుందన్నారు.

నేడు పత్తూరులో ఎమ్మెల్యే పర్యటన

ఖాజీపేట : మండలంలోని పత్తూరు సచివాలయం పరిధిలో గురువారం గడపగడపకూ మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైసిపి మండల కన్వీనర్ దుగ్గిరెడ్డి మురళీమోహన్ రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ధయాంఖాన్‌పల్లె, పత్తూరు గ్రామాల్లో కార్యక్రమం జరగనున్నట్లు తెలిపారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే శెట్టిపల్లి రఘురామిరెడ్డి ఆయా గ్రామాల్లో పర్యటిస్తారని తెలిపారు. కార్యక్రమానికి వైసిపి నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్య కర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు.

శ్రీ కృష్ణ గీతాశ్రమం, ప్రొద్దుటూరు

వేలం ప్రకటన

కడప జిల్లా, ప్రొద్దుటూరు మండలం, ప్రొద్దుటూరు టౌన్‌లో ఉన్న శ్రీకృష్ణ గీతాశ్రమవనకు సంబంధించి 4/612, డోర్‌నెంబర్‌లో ఆశ్రమ క్యాంపస్ నందు రూములు బాడుగకు ఇవ్వడానికి తేది: 16/08/2023 బుధవారం మధ్యాహ్నం 2.00 గంటలకు శ్రీ కృష్ణగీతాశ్రమం నందు బహిరంగవేలం నిర్వహించబడును. వేలంలో పాల్గొనదలచినవారు ఒక లక్ష రూపాయలు సెక్యూరిటి డిపాజిట్‌గా చెల్లించవలెను. మిగతా షరతులు వేలం సమయం నందు తెలుపబడును. ఆసక్తి గల వారు వేలం పాటలో పాల్గొనాలని కార్యనిర్వహణాధికారి తెలియజేశారు.

సి. శంకర్‌బాలాజీ,
కార్యనిర్వహణాధికారి.

మహారాజశ్రీ జూనియర్ సివిల్ జడ్జి సిద్ధవటం

I.A.No. 435/2022
In
O.S.No. 21/2029

ఎమ్.విశ్వనాథ్. **...Petitioner/Plaintiff**

Vs

పలుకూరు ఉదయభాస్కర్, S/o Late పి.వెంకటరమణయ్య, డోర్‌నెం.సి/288-1,చిన్నకొత్తపల్లి(V),H/o గంగపేరూరు (V), ఒంటిమిట్ట(మం), కడప జిల్లా.

...Respondent/Defendant No.2

నోటీసు

పై తెలిపిన దావాలో వాది అయిన విశ్వనాథ్ నీపై Specific Performance of Sale Agreement వ్యాజ్యాన్ని వేసియున్నారు. సదరు వ్యాజ్యములో పై తెలిపిన Restoration Petition 18.08.2023 తేదీన వాయిదా వున్నది. కావున మీరు 18.08.2023 తేదీన ఉదయము గం॥10.30 ని॥లకు మహారాజశ్రీ సిద్ధవటం కోర్టు వారి ఎదుట హాజరై మీ అభ్యంతరాలు తెలుపుకొనవచ్చు. లేనంతట మీ పరోక్షమున తీర్మానించబడును.

//By Order of Court//

వి.ధర్మకుమార్
న్యాయవాది, కడప.

ధర్నా చేస్తున్న కార్మిక నాయకులు

ప్రభుత్వాలు మూల్యం చెల్లించుకోకతప్పదు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

కార్మిక వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న ప్రభుత్వాలు మూల్యం చెల్లించుకోక తప్పదని సిఐటియు జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, పట్టణ కార్యదర్శి విజయకుమార్ తెలిపారు. సేవ్ ఇండియా అనే అంశంపై బుధవారం స్థానిక పాతబస్టాండ్ అంబేద్కర్ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి అధికారంలోకొచ్చిన ఈ తొమ్మిది సంవత్సరాల కాలంలో కార్మిక వ్యతిరేక విధానాలను అవలంభిస్తోందన్నారు. కార్మిక చట్టాలను రద్దు చేసి వారి నడ్డి విరిచిందన్నారు. దేశంలో ప్రజల పన్నుల రూపంలో సంపాదించుకున్న ఆస్తులను ప్రయివేటు వారికి కారుచౌకగా ధారాదత్తం చేయడం సిగ్గుచేటన్నారు. రాష్ట్రంలో ఉన్న ప్రాంతీయ పార్టీలు బిజెపి విధానాలపై నోరుమెదపక డూడూ బసవన్నలా తలలూపుతున్నాయని తీవ్రంగా విమర్శించారు. పార్లమెంట్‌లో ఏ చట్టం పెట్టినా పోటీలు పడి మద్దతు తెలుపుతున్నాయన్నారు. ఇలాంటి పార్టీలను ఇంటికి సాగనంపాలని, క్విట్ ఇండియా.. సేవ్ ఇండియా అని దేశవ్యాప్తంగా ఆందోళనా కార్యక్రమం చేపట్టామని వారు తెలిపారు. ధర్నాలో మున్సిపల్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు చంటి, సాల్మన్, రాఘవ, రవి, మోహన్, మున్సిపల్ యూనియన్ మహిళా నాయకులు లక్ష్మీదేవి, గుర్రమ్మ, నీతమ్మ, రమణమ్మ, ప్రమీలమ్మ, శాంతి పాల్గొన్నారు.

గర్భిణులకు పౌష్టికాహారం అందజేత

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం

స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో బుధవారం మల్లెపల్లి సర్పంచు చిలమల లక్ష్మీదేవి, ఆమె భర్త చిలమల నారాయణ ఆధ్వర్యంలో దాదాపు 60 మంది గర్భిణులకు, ఆస్పత్రికి వచ్చిన 40 మంది ఇతర రోగులకు పౌష్టికాహారం అందజేశారు. చికెన్, వడ, అరటిపండు కూడా అందజేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ మల్లేష్ మాట్లాడుతూ ఆస్పత్రికి ప్రతినెల 9న ప్రత్యేకంగా ప్రధానమంత్రి పథకం ద్వారా కేవలం గర్భిణులకు మాత్రమే వైద్యం చేస్తారన్నారు. భోజన వసతి ఏర్పాటు చేసిన సర్పంచు చిలమల లక్ష్మీదేవికి కృతజ్ఞతలు తెలిపారు. రాబోయే రోజుల్లో గర్భిణులకు దాతలు పౌష్టికాహారం అందించవచ్చని డాక్టర్ మల్లేష్ తెలిపారు. కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

మానవత ఆధ్వర్యంలో భోజన వసతి

ముద్దనూరు : ముద్దనూరు మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో బుధవారం పిహెచ్‌సిలో గర్భిణులకు భోజనం వసతి ఏర్పాటు చేశారు. వైద్యాధికారి కరిష్మా గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆరోగ్య కేంద్రంలో ప్రతి నెల 9న గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. తల్లీబిడ్డ ఆరోగ్యం కోసం గర్భిణులు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవాలు సురక్షితమన్నారు. పిహెచ్‌సికి వచ్చే గర్భిణులకు ఇప్పటి నుంచి ప్రతి నెల భోజనం ఏర్పాటు చేయనున్నట్లు మానవత సంస్థ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో సిహెచ్‌ఒ రాముడు, సూపర్‌వైజర్ శోభాకుమారి, ల్యాబ్ టెక్నీషియన్ జాసన్, ఫార్మసిస్టు జగదీష్, సిబ్బంది, మానవత సంస్థ అధ్యక్షులు, సభ్యులు పాల్గొన్నారు.

సిఎంను కలిసిన ఒంటెద్దు రఘునాథరెడ్డి, ఆయన కుటుంబసభ్యులు

సిఎంను కలిసిన రఘునాథరెడ్డి

ప్రజాశక్తి - కొండాపురం

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఎపి కనీసవేతనాల అడ్వయిజరీ బోర్డు చైర్మన్ ఒంటెద్దు రఘునాథరెడ్డి కలిశారు. తాడెపల్లిలోని సిఎం నివాసంలో బుధవారం మధ్యాహ్నం కలిసి ఆశీర్వాదం పొందారు. మండలంలోని చిన్నపల్లెకు చెందిన రఘునాథరెడ్డి 20ఏళ్లుగా వైయస్ కుటుంబం వెంట ఉంటున్నారు. ఆయన పార్టీకి చేసిన సేవలను గుర్తించి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వంలో కనీసవేతనాల అడ్వయిజరీ బోర్డు చైర్మన్‌గా నియమించారు. ఇందుకు గాను ఆయన సిఎంకు కృతజ్ఞతలు తెలిపారు. చివరివరకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంట ఉంటామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో రఘునాథరెడ్డి కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన వైసిపి

మైలవరం : అబద్ధపు హామీలతో వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని జమ్మలమడుగు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి భూపేష్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని తొర్రివేములలో భవిష్యత్తుకు గ్యారెంటీ అనే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి రమణారెడ్డి, పాపిరెడ్డి, రామాంజనేయులు, దేవగుడి కుటుంబం అభిమానులు, ప్రజలు పాల్గొన్నారు.

నరేంద్ర మోడీ నుంచి దేశాన్ని రక్షించాలి

వేంపల్లె : రాజ్యాంగానికి విరుద్ధంగా వ్యవహరిస్తున్న ప్రధాని నరేంద్ర మోడీని ఇంటికి పంపించి దేశాన్ని రక్షించాలని ఆమ్‌అద్మీ పార్టీ జిల్లా కో-ఆర్డినేటర్ రహంతుల్లా, జిల్లా ఉపాధ్యక్షుడు దాదాపీర్ కోరారు. ఆ మేరకు ఆమ్‌అద్మీ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో ఉన్న బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సమీర్, గౌస్‌బాషా, పీరుబాషా, సిరాజ్ పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణకు కృషి చేయాలి

వేంపల్లె : నులిపురుగుల నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మండల స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ రవీంద్రనాథ్‌రెడ్డి కోరారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో బుధవారం నులి పురుగుల నివారణపై సమావేశం నిర్వహించారు.

IN THE COURT OF THE HONOURABLE ADDITIONAL SENIOR CIVIL JUDGE, KADAPA

I.P.No. 42/2023

Smt. Sudha Vara Lakshmi, daughter of Sudha Ramana Reddy, wife of Pucha Ujwal Reddy, aged 33 years, Hindu, residing at Door No.4-7-304-15-1-5, Maithri Layouts, near Narayana College, Pulivendula Town, Kadapa District. Cell No.90000 80768. **...Petitioner**

Vs

1. Smt. Bhumireddy Radhamma, wife of late Raja Gopal Reddy, age 77 years, Hindu, Business, residing at Door No.4/63, Bidinamcherla Village, Simhadripuram Mandal, Kadapa District. Cell No. 77807 83803.
2. Smt. Bhumireddy Swarna Latha, wife of late Vijaya Vardhan Reddy, age 48 years, Hindu, Business, residing at Door No.1-1-210, Gopi Vihar Street, Pulivendula Town, Kadapa District. Cell No. 95051 07696.
3. Smt. Sudha Gayathri, wife of Madhu Mohan Reddy, age 51 years, Hindu, resident of Door No.1-1-203, Gopi Vihar Street, Pulivendula Town, Kadapa District. Cell No. 98858 30776.

...Respondents

GENERAL NOTICE TO RESPONDENTS

ఇందుమూలముగా ప్రతివాదులు అయిన మీకు క్రెడిటార్ I.P.లో తెలియజేయడం ఏమనగా పిటీషనరు మీ పై Creditor I.P. దాఖలు చేసియున్నారు. సదరు I.P. మీ నోటీసుకు గాను 28/8/2023వ తేదీన వాయిదా వున్నది. కావున మీరు 28/8/2023వ తేదీన ఉదయం 10.30గంటలకు పైన తెలిపిన కోర్టు నందు స్వయముగా గాని లేక వకీలు ద్వారా గానీ హాజరై ఎటువంటి ఆక్షేపణలు ఉన్న యడల తెలుపుకొనవలెను. లేనిచో రాజశ్రీ కోర్టు వారు మీ పై పరోక్షముగా తీర్మానించబడును.

//By Order of the Court//

S.S.D.RAMA SWAMY, L.L.M.,
Advocate for the Petitioner,
Kadapa City. Cell: 9849410091.